క్లుప్తంగా

శారదాపీఠాన్ని సందర్శించిన అమర్



స్వరూపానందేంద్ర సరస్వతి ఆశీస్సులు తీసుకుంటున్న దేవులపల్లి అమర్

సింహాచలం: విశాఖ శ్రీ శారదాపీఠాన్ని శనివారం ఏపీ ప్రభుత్వ జాతీయ మీడియా, అంతర్ రాష్ట్ర వ్యవహారాల సలహాదారు దేవులపల్లి అమర్ సందర్శించారు. పీఠాధిపతులు స్వరూపానందేంద్ర సరస్వతి, స్వాత్మానందేంద్ర సరస్వతిలను కలిసి ఆశీస్సులు తీసుకున్నారు. రాజశ్యామల అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. పీఠం ప్రాంగణంలోని దేవతా మూర్తుల ఆలయాలను సందర్శించారు.

వెంకటాద్రిపై విశేష పూజలు



వేంకటేశ్వరస్వామి

సింహాచలం: పెందుర్తి వెంకటాద్రిపై కొలువుదీరిన వేంకటేశ్వర స్వామి ఆలయంలో శనివారం స్వామికి విశేష పూజలు నిర్వహించారు. తెల్లవారుజామున 4గంటలకు స్వామిని సుప్రభాతసేవతో మేల్కొలిపి, ఆరాధన చేశారు. విశేషంగా అభిషేకాలు నిర్వహించారు. భక్తులు భారీగా తరలివచ్చి స్వామిని దర్శించుకున్నారు. ఆలయ అర్చకుడు రామానుజమ్ ఆధ్వర్యంలో అర్చకులు పూజలు నిర్వహించారు.

నిషేధిత ప్లాస్టిక్ వినియోగిస్తే చర్యలు



సింహగిరిపై వ్యాపారులకు సూచనలిస్తున్న ఈవో శ్రీనివాసమూర్తి

సింహాచలం: సింహగిరిపై వ్యాపారులు నిషేధిత ప్లాస్టిక్ సంచులు విక్రయిస్తే చర్యలు తీసుకుంటామని సింహాచలం దేవస్థానం ఈవో ఎస్.శ్రీనివాసమూర్తి హెచ్చరించారు. జోన్–8 జెడ్సీ మల్లయ్యనాయుడుతో కలిసి శనివారం సింహగిరిపై షాపింగ్ కాంప్లెక్స్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా వ్యాపారులకు పలు సూచనలు చేశారు. నిషేధిత ప్లాస్టిక్ వ్యాపారులు ఎవరూ వాడవద్దని సూచించారు. పరిసరాలను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచుకోవాలని, షాపుల వద్ద చెత్తాచెదారాలను వేస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో దేవస్థానం ఈఈ శ్రీనివాసరాజు తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీలకు మొక్కల పంపిణీ



మొక్కలను అందజేస్తున్న ఎంపీపీ నాగమణి

సింహాచలం: ఏపీ స్టేట్ బయోడైవర్సిటీ బోర్డు పెందుర్తి మండలానికి పంపిన 4815 ఔషధ మొక్కలను పంచాయతీల వారీగా అందజేస్తున్నామని ఎంపీపీ మధుపాడ నాగమణి తెలిపారు. పెందుర్తి ఎంపీడీవో కార్యాలయం వద్ద శనివారం ఆమె పంచాయతీల వారీగా మొక్కలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఏఈవో వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

బ్యాటరీ కార్లకు టెండర్ల ప్రకటనపై హర్షం

అగనంపూడి: దువ్వాడ రైల్వేస్టేషన్‌లో దివ్యాంగులు, వృద్ధులకు అనువుగా ఉండేలా బ్యాటరీ కార్లకు రైల్వే అధికారులు టెండర్లు పిలవడంపై దువ్వాడ రైల్వేస్టేషన్ యూజర్స్ అసోసియేషన్ హర్షం వ్యక్తం చేసింది. దువ్వాడ రైల్వేస్టేషన్ ఎస్సీపీసీ ట్రాక్ క్రాసింగ్ వంతెన నుంచి ప్లాట్‌ఫాంకు చేరుకోవడానికి దివ్యాంగులు, వృద్ధులు, గర్భిణులు అవస్థలను యూజర్స్ అసోసియేషన్ అధికారుల దృష్టికి తీసుకెళ్లింది స్పందించిన అధికారులు టెండర్లు పిలవడంపై అసోసియేషన్ హర్షం ప్రకటించింది.

ప్రజలకు ఆరోగ్య భరోసా

- అదే సీఎం వైఎస్ జగన్ లక్ష్యం
- ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్



పోషకాహార తినుబండారాలు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే అదీప్‌రాజ్



వైద్య శిబిరంలో ప్రసంగిస్తున్న ఎమ్మెల్యే అదీప్‌రాజ్

పరవాడ: రాష్ట్ర ప్రజలందరికీ మెరుగైన వైద్య సేవలందించడమే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి లక్ష్యమని ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ అన్నారు. రావాడ శివారు ధర్మారాయుడుపేటలో శనివారం ఏర్పాటు చేసిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని ఎమ్మెల్యే అదీప్‌రాజ్ ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజల ఆరోగ్యం కోసం దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి ఆరోగ్య శ్రీ అమలు చేస్తే ఆయన కుమారుడు , సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రెండడుగులు ముందుకేసి ఆరోగ్యశ్రీని విస్తరించడమే కాకుండా ప్రతి ఇంటికి వైద్యులను పంపి ఉచితంగా మందులు అందజేసే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారన్నారు. వైద్య శిబిరాల్లో సాధారణ రోగులతో పాటు కంటి పరీక్షలు జరిపి అవసరమైన వారికి ఉచితంగా కళ్లద్దాలు అందజేస్తున్నారని చెప్పారు. ప్రభుత్వం నిర్వహించే జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాల్లో ప్రజలకు రూపాయి ఖర్చు లేకుండా ఉచితంగా వైద్యం అందిస్తున్నారన్నారు. ప్రజలకు సేవ చేసే నాయకుడిని ఆదరించాల్సిన అవసరం ఉందన్నారు. ముఖ్యమంత్రిగా సంతకం చేసిన నాటి నుంచి నేటి వరకు 99 శాతం హామీలు అమలు చేశారని చెప్పారు. ప్రజలకు మంచి చేయాలన్న ఆలోచన చేస్తున్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని మరో సారి రాష్ట్రానికి ముఖ్యమంత్రి చేసుకోవడానికి ప్రజలు ముందుకు రావాలని ఎమ్మెల్యే అదీప్‌రాజ్ కోరారు. అంతకముందు సబ్బవరం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పోషకాహార స్టాల్‌ను ఎమ్మెల్యే సందర్శించి సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ పైల వెంకటపద్మలక్ష్మి శ్రీనివాసరావు, జెడ్పీటీసీ పైల సన్యాసిరాజు, వైస్ ఎంపీపీ బంధం నాగేశ్వరరావు, మండల పార్టీ అధ్యక్షుడు కోన రామారావు, మండల జేసీఎస్ కన్వీనర్ వెన్నల సన్యాసిరావు, సర్పంచ్ ఎం.ఎస్.నాయుడు, పార్టీ నాయకులు కావలి వాసు, కావలి అప్పలరాజు, పల్లా గోవింద్, అశోక్, పీహెచ్‌సీ వైద్యాధికారులు, కేజీహెచ్ వైద్యులు, వైద్య సిబ్బంది, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశవర్కర్లు పాల్గొన్నారు.

నరవ హైస్కూల్‌లో పొలంబడి



పాఠశాల ఆవరణలో మొక్కలు నాటేందుకు స్థలాన్ని సిద్ధం చేస్తున్న విద్యార్థులు



వివిధ రకాల మొక్కలతో విద్యార్థులు

గోపాలపట్నం: జీవీఎంసీ 88వ వార్డు నరవ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జేడీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో శనివారం పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులకు మొక్కలు నాటడం, వాటిని సంరక్షించడం వంటివి నేర్పించారు. పాఠశాల ఆవరణలో కొంత భాగాన్ని మొక్కలు నాటేందుకు అనువుగా తీర్చిదిద్దారు. వాటిలో వంగా, టమాటా, మిరప, కాలీఫ్లవర్, క్యాబేజీ వంటి కూరగాయల మొక్కలను విద్యార్థుల చేత నాటించారు. వాటిని ఏవిధంగా పెంచాలో వివరించారు. మొక్కలు నాటి వాటి బాధ్యతలు స్వీకరించిన విద్యార్థుల పేర్లను ఆయా మొక్కల వద్ద ఏర్పాటు చేశారు. దీని వల్ల వారికి బాధ్యతగా ఉంటుందని ఉపాధ్యాయులు తెలిపారు. కార్యక్రమంలో నేషనల్ గ్రీన్ కార్ప్ విద్యార్థులు, బయాలజీ ఉపాధ్యాయురాలు రమణి, కె.ప్రసాద్, పీఈటీ లక్ష్మీనారాయణ, జేడీ ఫౌండేషన్ సభ్యులు పాల్గొన్నారు.

చలో అలంపూర్ పోస్టర్ ఆవిష్కరణ

సబ్బవరం: అనకాపల్లి జిల్లా మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి అధ్యక్షుడు గొటివాడ సామ్రాట్ కుమార్ ఆధ్వర్యంలో శనివారం చలోఅలంపూర్ పోస్టర్ ఆవిష్కరించారు. అమృతపురంలో జరిగిన కార్యక్రమంలో మాదిగ ఉద్యోగుల సమాఖ్య జిల్లా అధ్యక్షుడు నీటిపల్లి ముత్యాలు మాట్లాడుతూ వచ్చే శీతాకాల సమావేశాల్లో ఎస్సీ వర్గీకరణ బిల్లు ప్రవేశ పెట్టాలనే డిమాండ్‌తో మంద కృష్ణ మాదిగ చేపట్టనున్న పాదయాత్రను జయప్రదం చేయాలన్నారు. కార్యక్రమంలో అనకాపల్లి జిల్లా ఉద్యోగుల సమాఖ్య సలహాదారులు దువ్వి దుర్గాలు,పెందుర్తి మండల యువసేన కన్వీనర్ నీటిపల్లి గౌరీ, మహాజన సోషలిస్టు పార్టీ నాయకులు గొటివాడ సన్యాసి,ముప్పిడి రాజు,చరణ్,స్వామి తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ బీమా తక్షణ సాయం అందజేత



పరిహారం అందజేస్తున్న ఎంపీటీసీ మామిడి లక్ష్మి

సబ్బవరం: మండలంలోని బలిజపాలెం గ్రామానికి చెందిన శిష్టి అర్జురావు అనారోగ్యంతో మృతి చెందారు. అతడికి వైఎస్సార్ బీమా వర్తించడంతో తక్షణ సాయంగా రూ.10 వేలు మృతుడి భార్య పూర్ణిమకు శనివారం ఎంపీటీసీ మామిడి లక్ష్మి అందజేశారు. మిగిలిన రూ.90 వేలు నామిని ఖాతాలో జమ అవుతాయని చెప్పారు. ఆమె వెంట సచివాలయ కన్వీనర్ మామిడి కొండాజీ, సచివాలయ కార్యదర్శి సూర్యమణి,వెల్ఫేర్ అసిస్టెంట్ కిరణ్ కుమార్ తదితరులు ఉన్నారు.

సంక్షేమం, రాష్ట్రాభివృద్ధి రెండు కళ్లు

- పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలు
- ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు



జంగాలకాలనీలో మహిళకు సంక్షేమ పథకాల బ్రోచర్ అందజేస్తున్న ముత్తంశెట్టి శ్రీనివాసరావు

సింహాచలం: ప్రజా సంక్షేమం, రాష్ట్రాభివృద్ధి రెండు కళ్లుగా చేసుకుని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన చేస్తున్నారని ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు అన్నారు. భీమిలి నియోజకవర్గం పరిధిలోని జీవీఎంసీ 98వవార్డు జంగాలకాలనీ, సాయినగర్‌లో శనివారం ఆయన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి సీఎం వైఎస్ జగన్ పాలనలో అందించిన సంక్షేమ పథకాలు, చేసిన అభివృద్ధిని వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కులమతాలు చూడకుండా, అవినీతికి తావులేకుండా అర్హులైన ప్రతీ ఒక్కరికీ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాలు అందించారన్నారు. ఇంటివద్దే ఒకటో తేదీన పింఛన్లు అందించి వృద్ధులకు అండగా ఉన్నారన్నారు. టీడీపీ పాలనలో అధికారులు, ప్రజాప్రతినిధుల చుట్టూ తిరగాల్సి వచ్చేదని.. నేడు అధికారులు, ప్రజా ప్రతినిధులు ప్రజల వద్దకు వెళ్లి వారి బాగోగులు చూసేలా జగన్‌మోహన్‌రెడ్డి చేశారన్నారు. వచ్చే ఎన్నికల్లో కూడా జగన్‌మోహన్‌రెడ్డిని ఆశీర్వదించాలని కోరారు.

ముత్తంశెట్టి దృష్టికి సమస్యలు

జంగాలకాలనీలోని సమస్యలను పలువురు ముత్తంశెట్టి దృష్టికి తీసుకెళ్లారు. శానిటేషన్ సమస్య, డ్రైనేజీ, ఎలక్ట్రికల్ సమస్య ఉందని స్థానికులు వివరించగా తక్షణమే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ఫాగింగ్ చేయాలని.. వాటర్ ట్యాంక్ ఎప్పటికప్పుడు క్లీన్ చేయాలని ఆదేశించారు.

ఎవరికీ పైసా చెల్లించవద్దు

తమకు పట్టాలు ఉన్నా ఫారెస్టు స్థలంలో ఉన్నామంటూ కొంతమంది అధికారులకు ఫిర్యాదులు చేస్తున్నారని.. నగదు డిమాండ్ చేస్తున్నారని ఎమ్మెల్యే దృష్టికి పలువురు నిర్వాసితులు తీసుకెళ్లారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఒక్కపైసా కూడా ఎవరికీ చెల్లించవద్దని, అంతా చూసుకుంటానని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో జీవీఎంసీ 8వజోన్ కమిషనర్ మల్లయ్యనాయుడు, 98వవార్డు వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి ఎర్ర వరహానరసింహం, అడవివరం కోఆపరేటివ్ సొసైటీ అధ్యక్షుడు కర్రి అప్పలస్వామి, వైఎస్సార్‌సీపీ నాయకులు కర్రి సత్తిబాబు, లంక సత్తిబాబు, సిరిపురపు కృష్ణ, మజ్జి ధర్మా, టి.రాము, శిడగం తాతబాబు, ఎస్.అప్పారావు పాల్గొన్నారు.

ముఖ్యమంత్రి దృష్టికి ఇళ్ల మరమ్మతులు

సింహాచలం దేవస్థానంతో ముడిపడి ఉన్న పంచగ్రామాల భూసమస్య త్వరలోనే పరిష్కారం అవుతుందని ముత్తంశెట్టి ఈ సందర్భంగా తెలిపారు. మరమ్మతుల విషయాన్ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లామన్నారు. త్వరలోనే అనుమతి వస్తుందని తెలియజేశారు.

ఘనంగా ఘంటసాల శతాబ్ది వేడుకలు



బాల కొండలరావుకు ఘంటసాల స్మారక పురస్కారంతో సత్కరిస్తున్న దృశ్యం. చిత్రంలో పురందేశ్వరి, శివమణి



అలరించిన నృత్యం

మద్దిలపాలెం: ఘంటసాల శతాబ్ది వేడుకలు మద్దిలపాలెం కళాభారతిలో శనివారం ఘనంగా జరిగాయి. చెన్నైకి చెందిన కళా ప్రదర్శిని సంస్థ వ్యవస్థాపకులు, ఘంటసాల కోడళ్లు పార్వతీరవి, కృష్ణకుమారిరత్న ఆధ్వర్యంలో వేడుకగా నిర్వహించారు. ఘంటసాల ఆలపించిన మధురగేయాలకు పార్వతీ రవి ఘంటాల నృత్య నిర్దేశకత్వంలో అలరించారు. ముఖ్యఅతిథిగా బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి పాల్గొన్నారు. ఈసందర్భంగా ఘంటసాల స్మారక పురస్కారాలను నాట్య గురువులు ఏబీ బాలకొండలరావుకు, వేదాంతం రామలింగ శాస్త్రిలకు అందజేశారు. ఈ సందర్భంగా పురందేశ్వరి మాట్లాడుతూ సంగీత సరస్వతి ముద్దు బిడ్డగా ఘంటసాల వేంకటేశ్వరరావు ఖ్యాతికెక్కారన్నారు. కార్యక్రమంలో రసజ్ఞ వేదిక అధ్యక్షుడు డాక్టర్.జి.రఘురామారావు, డాక్టర్. సయ్యద్ రెహ్మతుల్లా, జాన్ మాస్టార్, ఘంటసాల స్పోర్ట్ అండ్ కల్చరల్ అసోసియేషన్ వ్యవస్థాపకుడు చెన్నా తిరుమలరావు, ఎంవీ నాగేశ్వరరావు పాల్గొన్నారు. అంతకుముందు శివమణి తన డ్రమ్స్ విన్యాసంతో ప్రేక్షకులను ఉర్రూతలూగించారు. శివమణి డ్రమ్స్ వాయిద్యానికి ఆడిటోరియం మార్మోగిపోయింది.

కేంద్రం దిగి వచ్చేవరకూ పోరాటం

కూర్మన్నపాలెం: ప్రభుత్వరంగ సంస్థల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తున్న వారి సంఖ్య రోజురోజుకూ పెరుగుతోందని ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు అన్నారు. అన్ని పరిశ్రమల వద్ద దేశవ్యాప్తంగా పెద్ద ఎత్తున జరుగుతున్న నిరసనలే ఇందుకు నిదర్శనమని పేర్కొన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలో జరుగుతున్న రిలే నిరాహార దీక్షల్లో 968వ రోజు, పలువురు కార్మికులు, ఉక్కు నిర్వాసితులు పాల్గొని నిరసన తెలిపారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ విశాఖ ఉక్కు ప్రభుత్వరంగంలోనే కొనసాగుతుందని ప్రధాని నరేంద్రమోదీ స్పష్టమైన హామీ ఇవ్వాలన్నారు. అంతవరకు తమ పోరాటం కొనసాగుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు, ఇతర కార్మికులు పాల్గొన్నారు.

వైభవంగా అప్పన్న ఆర్జిత సేవలు



జీలకర్ర బెల్లం ఘట్టం నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి శనివారం ఆర్జిత సేవలు వైభవంగా జరిగాయి. ఉదయం 9.30 గంటల నుంచి నిత్యకల్యాణం శాస్త్రోక్తంగా నిర్వహించారు. స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి,భూదేవిలను ఆలయ కల్యాణ మండపంలోని వేదికపై అధిష్ఠంపజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, కంకణ ధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు తదితర ఘట్టాలతో కల్యాణం శాస్త్రోక్తంగా నిర్వహించారు.

వైభవంగా గరుడసేవ

శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి శనివారం గరుడ సేవ ఘనంగా నిర్వహించారు. స్వామివారి ఉత్సవ మూర్తి గోవిందరాజస్వామిని ఆలయ కల్యాణమండపంలోని గరుడవాహనంపై అధిష్ఠంపజేశారు. అష్టోత్తర శతనామావళి పూజ చేసి భక్తులను గరుడ వాహనం చుట్టూ ప్రదక్షిణ చేయించారు. విశేషంగా హారతులు అందజేశారు.

పరవాడలో విషాదం



బొడ్డు నరసింగరావు (ఫైల్)



చిరికి కిశోర్ కుమార్ (ఫైల్)

పరవాడ: రెండు రోజుల వ్యవధిలో గ్రామానికి చెందిన ఇద్దరు మృతి చెందడంతో పరవాడలో విషాదం అలముకుంది. సర్వజ్ఞ పాఠశాల వ్యవస్థాపకుడు బొడ్డు నరసింగరావు(52) నగరంలోని ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ గుండెపోటుతో శుక్రవారం మధ్యాహ్నం మరణించారు. ఈయనకు భార్య మంగవేణి, సాయిసంపత్, సాయి సునంద్ కుమారులు ఉన్నారు. ఇదిలావుండగా ఇదే గ్రామానికి చెందిన చిరికి కిశోర్‌కుమార్ (32) శనివారం మధ్యాహ్నం గుండెపోటుతో మరణించారు. తల్లిదండ్రులకు తీరని గుండె కోత మిగిల్చాడు. కిశోర్‌కుమార్ ప్రైవేటు కంపెనీలో పనిచేస్తున్నాడు. ఈయనకు భార్య శ్రావణి, నాలుగేళ్ల కుమారుడు ఉన్నారు. గ్రామంలో ఇరువురు వ్యక్తులు గుండె పోటుతో రెండు రోజుల వ్యవధిలో మరణించడంతో అంతా ఆందోళన చెందారు. బొడ్డు నరసింగరావు కుమారుడు అమెరికా నుంచి శనివారం సాయంత్రానికి స్వగ్రామానికి చేరుకోవడంతో ఆయన అంత్యక్రియలు ఆదివారం నిర్వహించడానికి సన్నాహాలు చేశారు. కిశోర్‌కుమార్ అంత్యక్రియలను ఆదివారం నిర్వహించనున్నారు. బొడ్డు నరసింగరావు, కిశోర్‌కుమార్ మరణంతో వారి కుటుంబాలతో పాటు గ్రామంలో విషాదఛాయలు అలముకున్నాయి.

ముగిసిన బ్యాడ్మింటన్ క్రీడాకారుల ఎంపికలు

పరవాడ: పి.బోనంగి సంస్కృతి గ్లోబల్ పాఠశాల ఆధ్వర్యంలో పరవాడ ఇండోర్ స్టేడియంలో శనివారం జిల్లా స్థాయి బ్యాడ్మింటన్ పోటీలకు అండర్ 14, 17 బాల బాలికల ఎంపిక పోటీలు నిర్వహించారు. అండర్–14 పోటీలకు ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ , అండర్–17 పోటీలను సంస్కృతి గ్లోబల్ పాఠశాల అంతర్జాతీయ శిక్షకుడు ఎం.వి.వి.మురళీ కృష్ణ ప్రారంభించారు. ఇక్కడ ఎంపికైన క్రీడాకారులు రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని పాఠశాల ప్రిన్సిపాల్ ఎన్.సీతాలక్ష్మి చెప్పారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆర్గనైజింగ్ కార్యదర్శులు టి.నాగేశ్వరరావు, పి.సూరిబాబు, ఎం.వి.నాగేశ్వరరావు క్రీడాకారులను ఎంపిక చేశారు. కార్యక్రమంలో సీఈవో కె.నిశాంత్, స్పోర్ట్స్ డైరెక్టర్ జి.మధుబాబు పాల్గొన్నారు.

త్వరలోనే మారిటైం హెరిటేజ్ కాంప్లెక్స్ ఏర్పాటు

- వీపీఏ చైర్మన్ అంగముత్తు
- ఘనంగా విశాఖ పోర్ట్ ఆవిర్భావ దినోత్సవం



మాట్లాడుతున్న పోర్ట్ చైర్మన్ అంగముత్తు

తాటిచెట్లపాలెం: విశాఖపట్నం పోర్ట్ అథారిటీ (వీపీఏ) 90వ ఆవిర్భావ దిన వేడుకలు శనివారం పోర్ట్ వ్యాపార భాగస్వాములు, ఉద్యోగుల మధ్య పోర్ట్ గెస్ట్‌హౌస్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథి పోర్ట్ చైర్మన్ డాక్టర్ ఎం.అంగముత్తు మాట్లాడుతూ పోర్ట్ అభివృద్ధికి పలు సూచనలిచ్చారు. త్వరలోనే పోర్ట్ వ్యాపార భాగస్వాముల సలహాలతో మారిటైం హెరిటేజ్ కాంప్లెక్స్‌ను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. దీని సందర్శనకు నగర పౌరులకు కూడా అవకాశం కల్పిస్తామని చెప్పారు. ఈ కాంప్లెక్స్‌లో 90 ఏళ్ల కాలంలో పోర్ట్‌లో వినియోగించిన వస్తువులు, పురాతన వస్తువులతోపాటు 90 వసంతాల పోర్ట్ ప్రయాణాన్ని వివరించే ఫొటోలతో ఎగ్జిబిషన్ ఏర్పాటు చేయనున్నట్లు వివరించారు. ఈ కాంప్లెక్స్‌ను బీచ్‌కు అభిముఖంగా నూతనంగా నిర్మించిన కంటైనర్ టెర్మినల్‌ను కలిపే విధంగా ఏర్పాటు చేస్తామని చెప్పారు. పోర్ట్ కార్యకలాపాలను సాధారణ ప్రజలు కూడా తెలుసుకునేలా రాస్‌హిల్స్‌పైన ప్రత్యేక ఏర్పాట్లు చేయనున్నామన్నారు. కార్యక్రమంలో పోర్ట్ డిప్యూటీ చైర్మన్ దుర్గేష్‌కుమార్ దూబే, చీఫ్ విజిలెన్స్ ఆఫీసర్ స్వామి, విభాగాధిపతులు, సీనియర్ అధికారులు పాల్గొన్నారు.

జూలో సందడి



వన్యప్రాణుల వేషధారణలో చిన్నారులు



ఎన్‌క్లోజరు బయట తిరుగుతున్న కనుజు

ఆరిలోవ: వన్యప్రాణి వారోత్సవాల్లో భాగంగా ఇందిరాగాంధీ జూ పార్కు సందడిగా మారింది. ఈ నెల 2న ఈ వారోత్సవాలు ప్రారంభమైన విషయం తెలిసిందే. పిల్లలు, పెద్దలకు వన్యప్రాణులకు సంబంధించిన అంశాలపై పోటీలు జరిపారు. ఇందులో భాగంగా శనివారం పిల్లలకు ఫ్యాన్సీ డ్రెస్ పోటీలు నిర్వహించారు. దీంతో చిన్నారులను వివిధ వన్యప్రాణుల వేషధారణ అలరించారు. ఈ సందర్భంగా జూ క్యూరేటర్ నందనీ సలారియా మాట్లాడుతూ వన్యప్రాణి వారోత్సవాలు ముగింపు సందర్భంగా ఆదివారం జూలో మారథాన్ నిర్వహించనున్నామన్నారు.



జూలో ఓ బాలుడు



వేషధారణలో అలంకరించిన పిల్లలతో తల్లిదండ్రులు



జలాశయంలో కొలువుదీరిన పక్షులు, ఖడ్గమృగం

సందడిగా అంతరిక్ష వేడుకలు



ఇస్రో ప్రదర్శనలు తిలకిస్తున్న విద్యార్థులు

తగరపువలస: భీమిలి మండలం దాకమర్రి రఘు ఇంజినీరింగ్ కళాశాలలో జరుగుతున్న ప్రపంచ అంతరిక్ష వేడుకలకు ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి వేలాది మంది విద్యార్థులు తరలివచ్చారు. మూడో రోజైన శనివారం ఇస్రో శాస్త్రవేత్తలు ఏర్పాటు చేసిన క్విజ్ పోటీలో 1,450, వ్యాసరచనలో 985, పోస్టర్ ప్రజెంటేషన్‌లో 310, చిత్రలేఖనంలో 1,860 మంది కలిపి మొత్తం 4,605 మంది విద్యార్థులు పాల్గొన్నారు. రాకెట్ ప్రయోగాలు, అంతరిక్ష పరిశోధనలకు సంబంధించి శాస్త్రవేత్తలు విద్యార్థుల సందేహాలను నివృత్తి చేశారు. రఘు విద్యాసంస్థల చైర్మన్ కలిదిండి రఘు, షార్ ఆర్గనైజింగ్ సబ్ కమిటీ చైర్మన్ జి.అప్పన్న పర్యవేక్షించారు. అంతరిక్ష వారోత్సవాల ముగింపు కార్యక్రమం ఆదివారం జరగనుంది. ఈ ముగింపు కార్యక్రమానికి డీఆర్‌డీవో నేవెల్స్ సిస్టమ్స్ మెటీరియల్ డైరెక్టర్ వై.శ్రీనివాసరావు, జేఎన్‌టీయూ విజయనగరం వీసీ కె.వెంకట సుబ్బయ్య, ఇస్రో చీఫ్ జనరల్ మేనేజర్ పి.వెంకటరెడ్డి తదితరులు హాజరుకానున్నారు.